# అర్బన్ వైద్యానికి పెద్ద పీట

కావలి నడిబొడ్డున ఉన్న ఏరియా వైద్యశాలను రూ.కోట్లతో ఆధునికీకరణ చేస్తున్న ప్రభుత్వం, అందులో మెరుగైన వైద్యానికి అవసరమైన మెడికల్ ఎక్విప్‌మెంట్‌ను ఏర్పాటు చేస్తోంది. దీంతో పాటు పట్టణానికి నలుమూలల ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందించేందుకు వీలుగా కొత్తగా అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మిస్తోంది. ఇప్పటికే పాతూరులో అర్బన్ హెల్త్ సెంటర్ ఉండగా, తాజాగా మరో మూడు హెల్త్ సెంటర్లను మంజూరు చేయడంతో నిర్మాణాలు పూర్తయ్యాయి. త్వరలోనే ప్రజలకు అంకితం చేయనున్నారు.

**ఇప్పటి వరకు పాతూరులోనే అర్బన్ హెల్త్ సెంటర్**

- వెంగళరావునగర్‌లో సబ్ సెంటర్
- కొత్తగా మూడు అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణం
- ఒక్కొక్క భవనానికి రూ.1.10 కోట్లు మంజూరు
- రూ.25 లక్షలతో పాతూరు అర్బన్ హెల్త్ సెంటర్‌లో మౌలిక వసతులు



వైకుంఠపురంలో నిర్మాణం పూర్తయిన అర్బన్ హెల్త్ సెంటర్ భవనం

కావలి: కావలిలో కొన్ని దశాబ్దాలుగా వైద్య సేవలు అందించిన ఏరియా వైద్యశాలను గత ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. పెరుగుతున్న పట్టణ, పరిసర మండలాల్లో జనాభాకు అనుగుణంగా ఏరియా వైద్యశాలను ఆధునికీకరించలేదు. ఆస్పత్రిలో అప్పటికే ఉన్న మెడికల్ ఎక్విప్‌మెంట్ సైతం పాతబడి నిరుపయోగంగా మారినా.. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడంలో కూడా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైద్యానికి పెద్ద పీట వేస్తున్న విషయం తెలిసిందే. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ వైద్యశాలలను బలోపేతం చేసేందుకు రూ.కోట్ల నిధులు వెచ్చించి, ఆధునికీకరించారు. కావలిలోని ప్రతిష్టాత్మకమైన ఏరియా వైద్యశాల ఆవశ్యకతను కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో ప్రస్తుతం ఆస్పత్రి ప్రాంగణంలో పాత భవనాల స్థానంలో సరికొత్త ఆధునిక వసతులతో భవనాలు నిర్మిస్తున్నారు. ఏరియా వైద్యశాలలోనే కార్పొరేట్ తరహా వైద్య సేవలు అందించేందుకు ఆధునికమైన మెడికల్ ఎక్విప్‌మెంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

**కొత్తగా మూడు అర్బన్ హెల్త్ సెంటర్లు**

కావలి నడిబొడ్డున ఏరియా వైద్యశాల ఉన్నప్పటికీ, పట్టణ ఉత్తర తూర్పు ప్రాంతం పాతూరులో మూడు దశాబ్దాల క్రితమే అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఆస్పత్రి భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు మౌలిక వసతులు కూడా కొరవడ్డాయి. కావలి పట్టణం శరవేగంగా విస్తరించడంతో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వ విధానమైన ఆరోగ్య సేవలు ప్రజలకు చేరువ చేయాలనే సంకల్పాన్ని అందిపుచ్చుకున్నారు. పట్టణ ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే ప్రతిపాదనలతో కొత్తగా మరో మూడు ప్రాంతాల్లో అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి చర్యలు చేపట్టారు. పట్టణ ప్రాంతాల్లో ప్రజల నివాసాలకు దగ్గరలోనే ప్రభుత్వ వైద్యులు, నర్సులు ఉండి ఆరోగ్య సేవలు అందించాలనే లక్ష్యంతో తాజాగా దక్షిణ తూర్పు ప్రాంతం పుల్లారెడ్డినగర్, దక్షిణ పశ్చిమ ప్రాంతం వెంగళరావునగర్, ఉత్తర పశ్చిమ ప్రాంతం వైకుంఠపురంలో అర్బన్ హెల్త్ సెంటర్లను ఒక్కొక్క దాన్ని రూ.1.10 కోట్లతో నిర్మించింది. మూడు దశాబ్దాల క్రితమే నిర్మితమైన పాతూరులో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌కు రూ.25 లక్షలు మంజూరు చేయించి వసతులు మెరుగు పరిచేలా అదనపు గదులు, అవసరమైన నిర్మాణాలు చేసేలా ఎమ్మెల్యే చొరవ తీసుకున్నారు. దీంతో పాత అర్బన్ హెల్త్ సెంటర్‌కు కొత్త కళ వచ్చింది.

**ప్రభుత్వ వైద్య వ్యవస్థ మెరుగు**



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ వైద్య వ్యవస్థను మెరుగు పరిచేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అందులో భాగంగానే కరోనా సమయంలో కావలి ఏరియా వైద్యశాలలో వసతులు కల్పించారు. తాజాగా రూ.కోట్లతో ఆధునిక భవనాలు, మెడికల్ ఎక్విప్‌మెంట్‌ను మంజూరు చేశారు. దీంతో పాటు పట్టణ ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందుబాటులో ఉండాలని భావించి ఒక్కొక్కటి రూ.1.10 కోట్లతో మూడు అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మించేందుకు నిధులు ఇవ్వడంతో త్వరలోనే అర్బన్ హెల్త్ సెంటర్ల ద్వారా వైద్యసేవలు అందించడానికి అవసరమైన అన్ని రకాల వైద్య పరికరాలు చేరుకోనున్నాయి. కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి కొత్త భవనాలు ప్రారంభోత్సవంతో పాటు ఈ కొత్త అర్బన్ హెల్త్ సెంటర్ లను ప్రారంభించడానికి కసరత్తు జరుగుతోంది.

– రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే, కావలి

## క్లుప్తంగా

### 2న గౌతమ్‌రెడ్డి కాంస్య విగ్రహావిష్కరణ

ఆత్మకూరురూరల్: దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి జయంతి సందర్భంగా నవంబరు 2న నెల్లూరు డైకస్‌రోడ్డు కూడలిలో ఆయన కాంస్య విగ్రహావిష్కరణ నిర్వహిస్తున్నామని మేకపాటి కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి పార్టీ, ప్రభుత్వం తరఫున పలువురు ప్రముఖులు హాజరవుతారన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, మండలాధ్యక్షులు, జేసీఎస్ కన్వీనర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు, వార్డు కౌన్సిలర్లు, మండలాల కోఆప్షన్ సభ్యులు, సొసైటీల అధ్యక్షులు, దేవాలయాల ధర్మకర్తల మండలి సభ్యులు, నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, మేకపాటి అభిమానులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

### 31 బీఎస్పీ రాజ్యాధికార చైతన్యసభ



సభపై ప్రచారం నిర్వహిస్తున్న బీఎస్పీ నాయకులు

ఆత్మకూరురూరల్: పట్టణంలో ఈ నెల 31న బహుజన సమాజ్‌పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బహుజన రాజ్యాధికారి చైతన్యసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు నందా ఓబులేసు, ఇన్‌చార్జి చెన్నుపల్లి రామకృష్ణ, దివానపు రజనీ ధర్మయ్య పేర్కొన్నారు. మండలంలోని బంట్లపల్లిలో ఆదివారం వారు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఆంధ్ర కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరురూరల్: పట్టణంలోని ఏపీ రెసిడెన్సియల్ స్కూల్ (బాలికలు)లో విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియంలో బోధించేందుకు గణితం, ఫిజికల్ సైన్స్ సబ్జెక్ట్‌లకు సంబంధించిన మహిళా ఉపాధ్యాయులను గెస్ట్ ఫ్యాకల్టీ పద్ధతిపై నియమించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ టి.కామేశ్వరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు డీఎస్సీ– 2018 మార్గదర్శకాల ప్రకారం బీఈడీ పోస్ట్‌గ్రాడ్యుయేషన్, టెట్ అర్హతలు కలిగి ఉండాలన్నారు. ఆసక్తిలోని అభ్యర్థులు నవంబరు 1లోగా తమ వివరాలతో కూడిన దరఖాస్తు ఫారాలను జెరాక్స్ ప్రతులతో సహా పాఠశాలలో సమర్పించాలన్నారు. అనంతరం జిల్లా ఉప విద్యాశాఖాధికారి కార్యాలయంలో కమిటీ ద్వారా డెమో తరగతులు నిర్వహిస్తారన్నారు.


### రక్తదానమే పోలీస్ అమరవీరులకు సరైన నివాళి



రక్తదానం చేస్తున్న ఆర్డీఓ శీనానాయక్

కావలి: విధి నిర్వహణలో ప్రాణాలను అర్పించిన పోలీస్ అమరవీరులకు రక్తదానమే సరైన నివాళి అని కావలి ఆర్డీఓ వీకే శీనానాయక్ అన్నారు. ఆదివారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆర్డీఓ ప్రారంభించడంతో పాటు స్వయంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ ఉద్యోగులతో పాటు పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రక్తదానం చేశారు. ఒకటో పట్టణ సీఐ శ్రీనివాసరావు, రెండో పట్టణ సీఐ సుధాకర్ పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలలకు వంటపాత్రలు



ఎంఈఓ కార్యాలయానికి చేరిన వంట పాత్రలు

ఉదయగిరి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం మంజూరు చేసిన నూతన వంట పాత్రలు ఎంఈఓ కార్యాలయానికి చేరినట్లు ఎంఈఓలు మస్తాన్‌వలి, తోట శ్రీనివాసులు తెలిపారు. మండలంలో 61 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయన్నారు. పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య ఆధారంగా స్టెయిన్‌లెస్ స్టీల్ వంట పాత్రలు, సామగ్రి వచ్చాయన్నారు. వాటిని త్వరలో ఆయా పాఠశాలలకు సరఫరా చేస్తామన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం కల్పిస్తుందన్నారు.

### నిందితులపై కఠిన చర్యలకు వినతి

నెల్లూరు(పొగతోట): కావలిలో ఆర్టీసీ బస్సు డ్రైవర్ రామ్‌సింగ్‌పై దాడికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు చేపట్టాలని ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లంపాటి పెంచలరెడ్డి, ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. స్పందన కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ ఉద్యోగ సంఘాలతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించనున్నామని చెప్పారు.

## దూదేకుల నూర్‌బాషా సింహగర్జనకు తరలిన నాయకులు



దూదేకుల నూర్‌బాషా సింహగర్జనకు తరలిన నాయకులు

మర్రిపాడు: గుంటూరులో జరిగే దూదేకుల నూర్ బాష సింహగర్జన మహాసభకు మర్రిపాడు మండలం నూర్‌బాషా అధ్యక్షుడు షేక్ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో దూదేకుల ముస్లింలు తరలి వెళ్లారు. చట్టసభలో దూదేకుల కులస్తులకు సముచిత స్థానం కల్పించాలనే డిమాండ్‌తో మహాసభకు అందరూ తరలివస్తున్నారని, దూదేకులపై చిన్నచూపు చూస్తున్న వారికి తమ సత్తా చూపుతామని జిల్లా నూర్‌బాషా దూదేకుల యూత్ అధ్యక్షుడు సుభాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువత నూర్‌బాషా ఉప అధ్యక్షుడు జహీర్, మహిళ అధ్యక్షురాలు వహీదా, సర్పంచ్ మస్తాన్, ఖాదర్ బాషా, మర్రిపాడు యువత తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ పోటీల్లో పతకాలు సాధించాలి




క్రీడాకారులతో ఆనం అరుణమ్మ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జాతీయ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు పతకాలను సాధించాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ కాంక్షించారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న స్క్వే మార్షల్ ఆర్ట్స్ శిక్షణ శిబిరాన్ని ఆదివారం సందర్శించిన అనంతరం ఆమె మాట్లాడారు. గోవాలో జరుగుతున్న జాతీయ పోటీల్లో మొదటిసారి స్క్వే మార్షల్ ఆర్ట్స్ పోటీలను నిర్వహిస్తుండటం, ఇందులో రాష్ట్ర జట్టు పాల్గొనడంపై సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం క్రీడాకారులను అభినందించారు. స్క్వే అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, కోచ్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశం



మాట్లాడుతున్న దేవకుమార్‌రెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని నగరంలోని ఇందిరాభవన్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ హయాంలో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించి శంకుస్థాపన చేస్తే, వాటికి టీడీపీ పేర్లు పెట్టుకొని గొప్పలు చెప్పుకొందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా అన్ని గ్రామాల్లో పర్యటించి ఓటర్లను చైతన్యవంతం చేయాలని కోరారు. డీసీసీ అధ్యక్షుడిగా తనను మూడోసారి నియమించిన అధిష్టానానికి, సహకరించిన కమిటీ సభ్యులకు కృతజ్ఞతలను తెలియజేశారు. పీసీసీ ఉపాధ్యక్షుడు శేషారెడ్డి, వెంకట్రావ్, అధికార ప్రతినిధి సురేష్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు బాలసుధాకర్, మంజుల, రిజ్వానా తదితరులు పాల్గొన్నారు.

## గంజాయిపై ఉక్కుపాదం

- జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న దాడులు



పట్టుబడిన గంజాయితో ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు

నెల్లూరు(క్రైమ్): గంజాయి రవాణా, విక్రయాలపై ఎస్‌ఈబీ అధికారులు స్థానిక పోలీసుల సహకారంతో దాడులను ముమ్మరం చేసి అక్రమార్కులను కటకటాల వెనక్కి పంపుతున్నారు. ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, ఏఎస్పీ హిమవతి పర్యవేక్షణలో ఎస్‌ఈబీ అధికారులు మూడు రోజులుగా స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నారు. జాతీయ రహదారి వెంబడి వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితులను పూర్తి స్థాయిలో విచారిస్తున్నారు. ఎస్‌ఈబీ నెల్లూరు – 2 ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు తన సిబ్బందితో కలిసి గొలగమూడి ఆర్చి సమీపంలో పాడుబడిన భవనంపై ఈ నెల 28న దాడులు చేశారు. ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకొచ్చి నగరానికి చెందిన రవితేజ, ఓబులాదర్శ్‌కు తమిళనాడు రాష్ట్రానికి చెందిన భరత్ షణ్ముగవేల్, చిన్నసామి విక్రయిస్తుండగా అరెస్ట్ చేశారు. వీరి నుంచి 11 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తాజాగా మరో 30 కిలోలపైగా గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితులను అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారని సమాచారం. గంజాయి రవాణా, విక్రయాలపై డయల్ 100, 14500కు సమాచారం అందించాలని ఎస్‌ఈబీ అధికారులు కోరారు.

## వేడుకగా పురిణమ్మకు పొంగళ్లు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

అల్లూరు: మండలంలోని పురిణి గ్రామదేవత పురిణమ్మకు ఆదివారం పొంగళ్లు కార్యక్రమాన్ని నిర్వహించారు. మతసామరస్యానికి ప్రతీకగా స్థానికుడు సయ్యద్ దిలీప్ ఆధ్వర్యంలో పంట పొలాల్లో వెలసిన పురిణమ్మకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి, అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీలకు చెందిన నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కోర్టు విధుల బహిష్కరణ కొనసాగింపు

కావలి: అడ్వొకేట్ వెల్ఫేర్ చట్టం 1987 సెక్షన్ 12 బీ ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని కోర్టుల్లో పిటిషన్లలో అదనంగా రూ.20 స్టాంపు అంటించాలని స్టేట్ బార్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కోర్టు విధుల బహిష్కరణ కొనసాగించాలని కావలి న్యాయవాదులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఆదివారం బార్ అసోసియేషన్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిన ఈ విధానాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రంలోని అన్ని కోర్టుల్లో న్యాయవాదులు విధులు బహిష్కరించి, వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఏకాభిప్రాయం కోసం ఈ నెల 21న స్టేట్ బార్ కౌన్సిల్ అధ్యక్షుడు గంటా రామారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశం అసంపూర్తిగా ఉండడంతో, ఈ నిర్ణయాన్ని రద్దు చేసే వరకు విధుల బహిష్కరణ కొనసాగుతుందన్నారు.

## నేడు సాయి భజన మందిరం వార్షికోత్సవం

ఆత్మకూరురూరల్: పట్టణంలోని శ్రీషిరిడీ సాయిబాబా భజన మందిరం 20వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం పలు కార్యక్రమాలు చేపడుతున్నామని సాయిబాబా మందిర కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి హారతి, సాయి సచ్చరిత్ర పారాయణం మేళ్లచెరువు శివకుమార్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పల్లకి సేవ, రాత్రికి షిరిడీ సాయి సేవా సమితి నిర్వాహకులు సుబ్బయ్య ఆధ్వర్యంలో భజనలు, ఉపన్యాసాలు ఉంటాయన్నారు.

## నేడు బీజేపీ కార్యవర్గ సమావేశం

చేజర్ల: బీజేపీ చేజర్ల మండల కార్యవర్గ సమావేశం సోమవారం జరుగుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటరామానాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చేజర్లలోని సాయికల్యాణ మండపంలో జరుగుతుందని తెలిపారు. ఈ కార్యవర్గ సమావేశానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో మండల కమిటీ, పలు అంశాలు చర్చిస్తారని తెలిపారు.

## 2న మెగా జాబ్‌మేళా

ఉదయగిరి: నవంబరు 2న ఆత్మకూరు ఆంధ్రా ఇంజినీరింగ్ కళాశాలలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఉదయగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు షేక్ గాజుల తాజుద్దీన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 25కు పైగా సంస్థలు పాల్గొంటాయని, ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సామాజిక సాధికార యాత్రను జయప్రదం చేయండి

జలదంకి/వరికుంటపాడు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సూచనలతో సోమవారం ఉదయం 10 గంటలకు ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వింజమూరు నుంచి ప్రారంభమయ్యే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని జలదంకి, వరికుంటపాడు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు పాలవల్లి మాలకొండారెడ్డి, ఆంధ్రా బాలగురవారెడ్డి ఆదివారం తెలిపారు. ఈ బస్సు యాత్ర వింజమూరు, దుత్తలూరు మండలాల మీదుగా ఉదయగిరి చేరుకుంటుందన్నారు. వింజమూరు, ఉదయగిరిలో భారీ బహిరంగ సభలు జరుగుతాయని తెలిపారు. ఈ బస్సు యాత్ర, బహిరంగ సభలకు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మేకపాటి అభిమానులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

## అలరించిన పాటలు, నృత్య పోటీలు



నెల్లూరు(బృందావనం): పురమందిరంలోని వర్ధమాన సమాజ హాల్లో కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు సుబ్బారావు ఆదివారం పాటలు, డ్యాన్స్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. పేద కళాకారులకు ఆర్థిక సాయం చేశారు. మిమిక్రీ కళాకారుడు అమానుల్లాఖాన్, కోలాట గురువు వంశీకృష్ణారెడ్డిలను సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాట ప్రదర్శన, సంగీత విభావరి అలరించాయి. పద్య కళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్, ప్రపంచ తెలుగు సమాఖ్య నెల్లూరు ప్రాంతీయ అధ్యక్షుడు బలరామయ్యనాయుడు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఒకరి రక్తంతో ముగ్గురి ప్రాణాలకు భరోసా

- రెడ్‌క్రాస్ రక్త కేంద్రాల రాష్ట్ర సమన్వయాధికారి బీవీఎస్ కుమార్
- రక్తదాన ప్రేరణకర్తలకు సత్కారం



ఆర్డీఓ శీనానాయక్‌ను సత్కరిస్తున్న దృశ్యం

కావలి: ఒకరి రక్తంతో మూడు ప్రాణాలను కాపాడవచ్చని, ఒక రక్తదాన శిబిరం ద్వారా వందలాది ప్రాణాలకు భరోసా కల్పించవచ్చని రెడ్‌క్రాస్ రక్త కేంద్రాల రాష్ట్ర సమన్వయాధికారి బీవీఎస్ కుమార్ అన్నారు. ఆదివారం రెడ్‌క్రాస్ భవనంలో జాతీయ రక్తదాన దినోత్సవాల సందర్భంగా రక్తదాన ప్రేరణ కర్తలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ కావలి రెడ్‌క్రాస్ రక్తకేంద్రం సేవలు రాష్ట్రంలోని పలు నగరాలకు దీటుగా ఉన్నాయన్నారు. ఇటీవల కావలిలో టీం సేవియర్స్ నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం రాష్ట్రంలోనే చరిత్ర సృష్టించిందన్నారు. కావలి ఆర్డీఓ, రెడ్‌క్రాస్ అధ్యక్షుడు వీకే శీనానాయక్ మాట్లాడుతూ రక్త సేకరణ, విపత్తు నిర్వహణలో రెడ్‌క్రాస్ కావలి శాఖ రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. కావలి రెడ్‌క్రాస్ సేవలను విస్తరిస్తామన్నారు. కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డి రవిప్రకాష్ మాట్లాడుతూ కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సహకారంతో రక్త కేంద్రాన్ని ఆధునికరించామన్నారు. కావలి రెడ్‌క్రాస్ రక్తకేంద్రం కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీం సేవియర్స్, అభయం, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆర్టీసీ, రెవెన్యూ శాఖలు, పలు విద్యాసంస్థల నిర్వాహకులకు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దగదర్తి ఎంపీపీ తాళ్లూరి ప్రసాద్‌నాయుడు, మున్సిపల్ కమిషనర్ జీ శ్రావణ్‌కుమార్, తహసీల్దార్ కె.మాధవరెడ్డి, ఆర్టీసీ డీఎం రాపూరు శ్రీనివాసులు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎస్.శ్రీనివాసకిరణ్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు దామిశెట్టి సుధీర్ నాయుడు, గంధం ప్రసన్నాంజనేయులు, కలికి శ్రీహరిరెడ్డి, ప్రణీత్, అభయం శ్రీవాణి, ఎంవీ సిద్ధూ తదితరులు పాల్గొన్నారు.

## త్రుటిలో తప్పిన ప్రమాదం



గుంతలోకి దూసుకెళ్లిన కారు

ఉదయగిరి: మండలంలోని దాసరపల్లి సమీపంలో ఆదివారం ఓ కారుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. ఉదయగిరి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కావలి నుంచి ఉదయగిరికి వస్తుండగా, అదే సమయంలో దాసరపల్లి నుంచి జాఫర్‌అలి తన ఇద్దరు పిల్లలతో కలిసి కారులో ఉదయగిరికి వస్తున్నారు. ముందు వెళ్తున్న బస్సును ఓవర్‌టేక్ చేసేందుకు హారన్ కొట్టడంతో బస్సు డ్రైవరు దారి ఇచ్చాడు. కారు బస్సును క్రాస్ చేసే సమయంలో తిరిగి బస్సు రోడ్డుపైకి రావడంతో అప్రమత్తమైన జాఫర్‌అలి కారును రోడ్డు మార్జిన్ పక్కనే ఉన్న గుంతలోకి దించాడు. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. బస్సు డ్రైవరు ఏవీరెడ్డిని నిలదీయగా సరైన సమాధానం చెప్పకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

## ఆర్టీసీ బస్సులకు అంతరాయం కలిగించొద్దు



ఆటోవాలాలతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అల్లూరు: ఆటో, మ్యాజిక్ డ్రైవర్లు ఆర్టీసీ బస్సులకు అంతరాయం కలిగించొద్దని వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు నీలం సాయికుమార్ అన్నారు. ఆదివారం ఆటో, మ్యాజిక్ వాహనాల డ్రైవర్లతో వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడారు. నెల్లూరు బస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్సులకు ఆటోవాలాలు, మ్యాజిక్ డ్రైవర్లు అడ్డం పెట్టడంతో బస్సులు మలుపు తిరిగేందుకు ఇబ్బంది ఏర్పడుతుందని, ఆర్టీసీకి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు షేక్ ఉస్మాన్, మేడా శ్రీనివాసులరెడ్డి, రమేష్‌రెడ్డి, పరిశినేటి రాజేష్, హజరత్ తదితరులు పాల్గొన్నారు.

## కిర్మాణి సేవలు అభినందనీయం



సఫ్దర్ కిర్మాణిని సన్మానిస్తున్న ముస్లింలు

కావలి: ముస్లిం మైనార్టీ నేత, సామాజిక కార్యకర్త సఫ్దర్ కిర్మాణి సేవలు ఆదర్శనీయం, అభినందనీయమని వాయిస్ ఆఫ్ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు మొగల్ సలీంబేగ్ అన్నారు. ఇటీవల హైదరాబాద్ నవనిర్మాణ ప్రజాసంక్షేమ సమితి నుంచి డాక్టరేట్‌ను పొందిన సఫ్దర్ కిర్మాణిని ఆదివారం స్థానిక కసాయి వీధిలోని అక్సా మసీదులో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం పెద్దలు మాట్లాడుతూ వాకర్స్ అసోసియేషన్ తరఫున, సామాజిక సేవా సంస్థల ద్వారా పలు సేవా కార్యక్రమాలు, మసీదు, మదర్సాలకు చేయూతను ఇస్తూ కిర్మాణి అందిస్తున్న సేవలను అభినందించారు. విశ్రాంత హెచ్‌ఎం పఠాన్ జాఫర్ ఖాన్ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో డాక్టర్ ముష్తఖనీల్ అహ్మద్, విశ్రాంత పోస్టుమాస్టర్ షేక్ కాలేషా, ముస్లిం మత పెద్దలు పఠాన్ నవాజ్‌ఖాన్, షేక్ కరీముల్లా, మొగల్ అలీంబేగ్, ముఫ్తి సుహేల్, మౌర్య సయీద్, మౌల్వీ ఖలీల్, మౌల్వీ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గ్యార్వీ ఏ షరీఫ్



భక్తులకు అన్నదానం చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ కేవీ శ్రావణ్‌కుమార్, కౌన్సిలర్ కౌసల్యమ్మ

ఆత్మకూరురూరల్: పట్టణం జేఆర్‌పేటలో గౌస్ ఏ పాక్ నిసాని వద్ద ఆదివారం గ్యార్వీ ఏ షరీఫ్ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, 4వ వార్డు కౌన్సిలర్ కోడూరు కౌసల్యమ్మ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం దువ్వా నిర్వహించి భక్తులకు వరఫలం అందజేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో షేక్ ఎస్ధానీబాషా, కాలేషా సేవలు అందించారు.